క్లుప్తంగా

సీఎం జగన్ మేలు మరువలేం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

గోరంట్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నేతన్న నేస్తం నిధులు విడుదల చేసిన సీఎం జగన్ మేలు మరువలేమని చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని గుమ్మయ్యగారిపల్లి క్రాస్ వద్ద చేనేతలు సంబరాలు జరుపుకున్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాం నాయక్, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్, నాగేనాయక్ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

గుడిబండ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ సాయికృష్ణ పేర్కొన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాలన్నారు. వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. అప్పుడే పర్యావరణాన్ని రక్షించుకోవచ్చన్నారు. పీసీ చైర్‌పర్సన్ చైత్ర, ఉపాధ్యాయులు పాల్గుణరావు, లింగ పాల్గొన్నారు.

రాజీ మార్గంతో కేసుల పరిష్కారం



ఓ కేసు పరిష్కారంపై చర్చిస్తున్న ఏడీజే శైలజ

హిందూపురం అర్బన్: రాజీ మార్గంతో కేసులను పరిష్కరించుకోవడం వల్ల సత్వర న్యాయం జరుగుతుందని అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజ పేర్కొన్నారు. శనివారం అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శైలజ మాట్లాడుతూ.. కక్షదారులు రాజీ మార్గంలో సామరస్యంగా మాట్లాడుకుని కేసులను పరిష్కరించుకోవాలన్నారు. న్యాయస్థానాలు, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరగడం వల్ల సమయం వృథాతో పాటు డబ్బు ఖర్చు అవుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగభూషణరావు, నాగరాజురెడ్డి, వన్నెరప్ప, సంతోషికుమారి, రెహమాన్, గోపాలకృష్ణ, నాగప్ప, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో అయ్యప్ప స్వామి

హిందూపురం: స్థానిక పాండురంగనగర్‌లో ఉన్న అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవ మూర్తిని పల్లకీలో కొలువుదీర్చి ప్రత్యేక అలంకరణతో ప్రాకారోత్సవం చేవారు. పూజల అనంతరం మంగళ హారతి ఇచ్చారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు కార్యదర్శి వరప్రసాద్, కోశాధికారి రమేష్, ఉపాధ్యక్షులు రమేష్, గురుస్వాములు రాఘవేంద్రశర్మ, పేట్ల వెంకటేష్, పెయింటర్ వెంకటేష్, శ్రీనివాసులు, శ్రీరాములు, తిరుమలేష్ పాల్గొన్నారు.

ఎస్‌డీఎంసీ అధ్యక్షుడిగా నగేశ్



నూతన అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని అక్షరాస్యత గ్రామంగా పేరు పొందిన కె.రామపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడిగా రాంపురం నగేశ్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అల్కూరప్ప సైతం రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక పాఠశాల ఆవరణలో పాఠశాల అభివృద్ధి సమితి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇంద్రమ్మ, సహోపాధ్యాయుడు చంద్రశేఖర రెడ్డి, పీడీఓ అక్కులప్ప, సీఆర్పీ అక్కులప్ప, పంచాయతీ మాజీ అధ్యక్షుడు దేవేంద్ర, సభ్యుడు గోపి, సమితి సభ్యులు రాజు, శంకరప్ప, పరమేష్ పాల్గొన్నారు.

జగన్ పాలనకే ప్రజల మద్దతు

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి




మండలపల్లిలో లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

గుడిబండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. జగనన్న పాలనకు ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారన్నారు. శనివారం మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతోందన్నారు. ఉపాధ్యాయులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా బోధన సాగించాలన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. ఈ సంక్షమ పథకాలు ఇలాగే అందాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలన్నారు. అంతేకాకుండా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తక్షణమే సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, డైరెక్టర్ నాగన్న, జెడ్పీటీసీ భూతరాజు, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీడీఓ రామారావు, ఎంపీటీసీ నాగమణి, కోఆప్షన్ మెంబర్ తౌసిఫ్, సచివాలయ కన్వీనర్ కె.శివకుమార్, మండల బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు పాడు, రమేష్, నాయకులు కృష్ణమూర్తి, రమేష్, రంగనాథ్, రాయుడు, భోజరాజు, డీలర్ రాజు, పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సమావేశం దోహదం

మడకశిర: నియోజకవర్గ అభివృద్ధిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ అరుణ్ బాబు ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశం సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తుందని ఎమ్మెల్యే తిప్పేస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దాదాపు 55 సమస్యలను ఈ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. మడకశిర అభివృద్ధిపై శ్రద్ధ చూపాలని మంత్రి, కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

ఆదిలక్ష్మి సేవలు అమోఘం





ఓబులేసుకు రూ.1,000 ప్రభుత్వ సాయం అందిస్తున్న వలంటీర్ ఆదిలక్ష్మి (ఫైల్)

కరోనా కష్టకాలంలో ప్రాణాలు కూడా లెక్క చేయకుండా వలంటీర్లు కీలకమైన సేవలందించారు. ఆపద్బాంధవుల్లా మారి సంక్షేమ పథకాలతో పాటు నిత్యావసర సరుకులను ఇంటి వద్దకే చేరవేశారు. కరోనా విపత్కర పరిస్థితిలో ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేషన్ కార్డుదారులకు రూ.1,000 సాయం మంజూరు చేశారు. ఆ సమయంలో మడకశిర మండలం జక్కేపల్లిలో రేషన్‌కార్డు లబ్ధిదారుడు ఓబుళేసు బయటికి రాలేక ఇంటికే పరిమితం అయ్యాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఆదిలక్ష్మి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సాయం అందజేసింది. వేకువజామునే ఇంటి వద్దకు వచ్చి నగదు అందజేసిన వలంటీర్‌ను స్థానికులు అభినందించారు.

– మడకశిరరూరల్:

ఇంటి వద్దకే ప్రభుత్వ సాయం



కరోనా నివారణకు అమలు చేసిన లాక్‌డౌన్‌తో ప్రజలు కష్టాలు పడకూడదని ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1,000 ఆర్థిక సాయాన్ని వలంటీర్ ఆదిలక్ష్మి ఇంటి వద్దకే వచ్చి అందజేసింది. ఆ సమయంలో వలంటీర్ సేవలతో ఎంతో సంతృప్తి చెందాం. మాకు ఏ సమస్య వచ్చినా వలంటీర్ దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని చెబుతుంది. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తోంది. – ఓబులేసు జక్కేపల్లి

కొనసాగుతున్న 'జగనన్న సురక్ష'



రొళ్ల: సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



లేపాక్షి: లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న పార్టీ సమన్వయకర్త దీపిక

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష శిబిరాలు హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో శనివారం జరిగాయి. రొళ్ల మండల కేంద్రంలోని సచివాలయం–2 ఆవరణలో ఎమ్మెల్యే తిప్పేస్వామి చేతులమీదుగా 845 సర్టిఫికెట్లను అధికారులు పంపిణీ చేశారు. లేపాక్షి మండలంలోని చోళసముద్రం, హిందూపురంలోని కొటిపి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త దీపిక పాల్గొన్నారు. అర్హులందరూ సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. అమరాపురం, చిలమత్తూరు, పరిగి, రొద్దం, గుడిబండ అగళి తదితరల మండలాల్లో ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు ధ్రువపత్రాలు అందజేశారు. – సాక్షినెట్‌వర్క్:

25న విద్యాసంస్థల బంద్

హిందూపురం టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, టీఎన్‌ఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 25న రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. శనివారం స్థానిక ఇందిర పార్కులో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ సంపత్, టీఎన్‌ఎస్‌ఎఫ్ అభి, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

మడకశిర: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దాడి చేసి, ఆరుగురు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.20,520 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడిలో పెనుకొండ సెబ్ సీఐ సుబ్బారెడ్డి, హెచ్‌సీలు సాల్మన్‌రాజు, శివ, జనార్దన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పట్టుగూళ్ల రీలర్లకు ఇన్సెంటివ్‌లు



మంత్రి పెద్దిరెడ్డితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి, తదితరులు

హిందూపురం: అతి త్వరలో పట్టుగూళ్ల రీలర్లకు రావాల్సిన పట్టు ఇన్సెంటివ్‌లు మంజూరు చేయిస్తానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పట్టురీలర్స్ తమకు అందాల్సిన ఇన్సెంటివ్‌లు మంజూరు చేయించాలని కోరారు. శనివారం తాడిపత్రికి విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వేణురెడ్డి, చల్లారెడ్డి బాబురెడ్డి ఆధ్వర్యంలో రీలర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి వినతి పత్రాలు అందజేశారు. కేజీ రూ.135 ప్రకారం పట్టు ఇన్సెంటివ్ రెండేళ్ల బకాయిలు మంజూరు చేయాలని కోరారు.స్పందించిన మంత్రి.. రూ.6 కోట్ల బకాయిలు మంజూరు చేయాలని పట్టు పరిశ్రమశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే జామియా మసీద్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలువురు మసీదు కమిటీ సభ్యులు మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి.. మసీద్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, సిల్క్ రీలర్స్ అసోసియేషన్ నాయకులు అన్సర్‌బాషా, ముస్తఫా, ఖలీల్‌బాష , జామియా మసీదు ముత్తవల్లి నూరుల్లా ఖాన్, ఆనంద్ రెడ్డి, కమిటీసభ్యులు ఫైరోజ్, ముక్తియార్, నసురుల్లా, అబ్బాస్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కార్తీక్

పరిగి: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. శనివారం పరిగికి వచ్చిన ఆయన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. తొలుత పాఠశాలలో వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. కోడిగుడ్లను పరిశీలించి, సైజున్న అరటి పండ్లను విద్యార్థులకు ఇవ్వాలని ఎస్‌ఓ సువర్ణమ్మను ఆదేశించారు. పాడైపోయిన, కుళ్లిన కూరగాయలను వాడొద్దని సూచించారు. నిర్దేశించిన సమయంలోనే చిక్కీలను విద్యార్థులకు ఇవ్వాలన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం ఉన్నారు.

గుండుమల కేజీబీవీ తనిఖీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల కేజీబీవీ పాఠశాలను శనివారం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గదులు, వంటగది పరిశుభ్రత, భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. విద్యాబోధన, అడ్మిషన్లపై చర్చించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముర్షావలి, ఎంఈఓ భాస్కర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మడకశిరరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నామని ఆర్జీటీ ఏటీఎల్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మడకశిర, పరిగి మండలాల్లోని 16 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువున్న బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. 100, 400 మీటర్ల పరుగు పందెం, త్రోబాల్, షాట్‌పుట్ తదితర పోటీల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు ఆగస్టు 27 నుంచి 29 వరకూ జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణమోహన్ రెడ్డి, సర్పంచ్ గంగమ్మ, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ చిక్కమ్మ, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామానికి చెందిన ఉప్పర గంగాధరప్ప శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ అశ్వర్థ నారాయణ శనివారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. మిగిలిన మొత్తం త్వరలో నామినీ ఖాతాలో జమ అవుతుందని పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య పేర్కొన్నారు. ప్రభాకర్, కరియప్ప పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన అమానుషం



పెనుకొండలో నిరసన తెలుపుతున్న ఐద్వా మహిళలు

హిందూపురం టౌన్: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేయడం దారుణమని ఏఐఎంఎస్‌ఎస్, ఏఐడీఎస్‌ఓ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎంఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు హేమావతి, ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ మాట్లాడారు. మహిళలపై క్రూరంగా వ్యవహరించిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో తక్షణమే శాంతి నెలకొనేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎంఎస్‌ఎస్ పరిగి ఇన్‌చార్జ్ కీర్తి, గౌతమి, అధ్యాపకులు శ్రీనివాసులు, సత్య, ఇందుమతి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

హిందూపురం టౌన్: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ.. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెంటనే రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, రాము, రాజప్ప, రమణ, బాబావలి, జ్యోతమ్మ, నందీశ్వర, లక్ష్మీనారాయణరెడ్డి, రామకృష్ణ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: మణిపూర్‌లో మహిళలను వేధించిన దుర్మార్గులను శిక్షించాలని ఐద్వా మహిళా సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్, జిల్లా కార్యదర్శి గౌతమి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మహిళలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, బావమ్మ, హరి, గంగాధర్, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేయండి



మద్దనకుంటలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

హిందూపురం టౌన్: తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధ చేసే బాధ్యత బూత్ స్థాయి అధికారులపై ఉందని తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఇంటింటి ఓటరు సర్వేను పర్యవేక్షించారు. యాప్ పని తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరమణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని మద్దనకుంట, అమరాపురం గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి ఓటరు సర్వేను తహసీల్దార్ రమేష్‌బాబు పరిశీలించారు. అధికారులు, ఓటర్లకు సూచనలిచ్చారు. ఓటరు తొలగింపు, మార్పులు చేర్పులపై ఆరా తీసి, తుది జాబితాను రూపొందించాలన్నారు. పక్కాగా సర్వే చేయాలని అధికారులకు సూచించారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం–6, డబుల్ నమోదు ఉంటే వాటిని ఫారం–7తో తొలగించాలన్నారు.

దేవదాయ భూమిని కాపాడాలి



భూమి పత్రాలను చూపుతున్న ఈఓ నాగేంద్రుడు

హిందూపురం టౌన్: అనంత పద్మనాభ స్వామి ఆలయానికి చెందిన భూమిని కొందరూ ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆలయ ఈఓ నాగేంద్రుడు తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వివరాలను వెల్లడించారు. నానెప్ప అనే వ్యక్తి ఆలయానికి ధారదత్తం చేసిన భూమిని దేవాదాయ శాఖ సెక్షన్ 38 ప్రకారం 1956 రిజిస్టర్‌గా నమోదు చేసిందన్నారు. ప్రస్తుతం ఈ భూమి విలువ సుమారు రూ.20 కోట్లు విలువ చేస్తుందన్నారు. సదరు భూమిని ఆక్రమించుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అయినప్పటికి కబ్జాదారులు భూమిలోకి ప్రవేశిస్తూ ఆక్రమణకు యత్నిస్తున్నారని తెలిపారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు.

ఘనంగా వికలాంగుల సొసైటీ వార్షికోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రొద్దం: స్థానిక అనంతశక్తి సొసైటీ కార్యాలయ ఆవరణలో శనివారం టింబక్టు కలెక్టివ్ సహకారంతో ఏర్పడిన ప్రతిభా వికలాంగుల పరస్పర సహాయక సహకార పొదుపు సొసైటీ 15వ వార్షికోత్సవం నిర్వహించారు. తొలుత సొసైటీ వార్షిక కార్యకలాపాలు, ఆడిట్ బడ్జెట్ నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆ సొసైటీ అధ్యక్షుడు నాగరాజు, సీఈఓ నరసింహులు, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాలకు చెందిన 350 మంది వికలాంగ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తిని సస్పెండ్ చేయాలి

పావగడ: తమను కించ పరచేలా వ్యాఖ్యలు చేసి అవమానించిన పావగడ తాలూకా ఆహార ధాన్యాల సరఫరా శాఖ శిరస్తుదారు కృష్ణమూర్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రేషన్ కార్డుల పంపిణీ సంఘం అధ్యక్షుడు కృష్ణప్ప కోరారు. చౌక ధాన్యపు డిపోల నిర్వాహకుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

విద్యతోనే సామాజికాభివృద్ధి

హిందూపురం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం అవుతుందని న్యాయవాదులు పేర్కొన్నారు. శనివారం స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. ర్యాగింగ్ ఈవ్ టీజింగ్ వంటి అకృత్యాలతో బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నెరప్ప, న్యాయవాదులు కళావతి, సంతోష్, కుమారి నవేరా, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, లోక్ అదాలత్ హేమావతి, వార్డెన్ శ్రీదేవి పాల్గొన్నారు.

పరిపాలనాధికారిగా ప్రసాద్ నియామకం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారిగా ప్రసాద్ శనివారం సాయంత్రం జెడ్పీ సీఈఓ భాస్కర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఇక్కడ ఏఓగా పని చేస్తున్న ఆరాధ్య మడకశిర ఎంపీడీఓ కార్యాలయానికి ఇటీవల బదిలీ అయ్యారు.

చిలమత్తూరులో రేపు 'డివిజన్ స్థాయి స్పందన'

పెనుకొండ: చిలమత్తూరులో ఈనెల 24న డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ కార్తీక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ స్పందన జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి డివిజన్ స్థాయి, చిలమత్తూరు మండల స్థాయి అధికారులు హాజరవుతారన్నారు.

రాజకీయ కుట్రతో పళవల్లి సొసైటీ రద్దు?

పావగడ: తాలూకాలోని పళవల్లి వీఎస్‌ఎస్‌ఎన్ సొసైటీని రద్దు చేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ డీడీ ఆదేశాలు జారీ చేయడం దుమారం రేపింది. లబ్ధిదారులకు మెరుగైన సేవలందిస్తున్న సొసైటీని అకస్మాత్తుగా రద్దు చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఆ సొసైటీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చన్నమల్లయ్యను టార్గెట్ చేసుకుని సొసైటీనే రద్దు చేసినట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో చన్నమల్లయ్య కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే వెంకటేశ్‌కు మద్దతు ఇవ్వలేదు. జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్పకు మద్దతు ఇచ్చారనే ద్వేషంతో పళవల్లి సొసైటీని రద్దు చేసినట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అలాగే తక్కువ తూకాలతో ఆహార ధాన్యాలను అందిస్తున్నారంటూ స్థానిక ఆహార సరఫరా శాఖ శిరస్తుదారు కృష్ణమూర్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ సొసైటీని రద్దు చేశారని సమాచారం.

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు



ఉపాధ్యాయురాలు శ్రీసుధకు సన్మానం

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మల్లికార్జున, రామకృష్ణ, విమలమ్మకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

లేపాక్షి: బిసలమానేపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న రాజీవ్‌నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయురాలు శ్రీసుధను సర్పంచ్ నాగేంద్రబాబుతో పాటు ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు.

పరామర్శ

పెనుకొండ: హిందూపురం పట్టణంలో ఆరేళ్ల బాలికను హింసించిన తల్లి, ఆమె ప్రియుడిని శిక్షించాలని రాష్ట్ర మానవహక్కుల సంఘం మహిళా విభాగం చైర్‌పర్సన్ రాజేశ్వరి, జిల్లా వైస్ చైర్మన్ నంజుండ, రాయలసీమ మీడియా సెక్రటరీ శ్రీనివాసులు కోరారు. శనివారం వారు హిందూపురంలో బాధిత చిన్నారిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా, పద్మావతి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

మోటార్ పంపు చోరీ

అమరాపురం: తన తోటలోని మోటార్ పంపు, కేబుల్ శుక్రవారం రాత్రి చోరీకి గురైనట్లు మండల కేంద్రానికి చెందిన నాగరాజు తెలిపాడు. రూ.42 వేల దాకా నష్టం వాటిలినట్లు వాపోయాడు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఘనంగా అధిక శ్రావణ మాస పూజలు

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో అధిక శ్రావణ మాస పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శనీశ్వరుడికి తైలాభిషేకం, నవగ్రహ పూజలను అర్చకులు చేపట్టారు. శీతలాంభదేవికి కుంకుమార్చన చేశారు. వందలాది మంది భక్తులు శనీశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చే నెల 17న నిజ శ్రావణ మాసం ప్రారంభం అవుతుందని అర్చకులు తెలిపారు.

నాడు–నేడు పనుల్లో వేగం పెంచాలి

రొళ్ల: పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పిల్లిగుండ్ల ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు పథకం కింద జరుగుతున్న ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.

నేడు ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి రాక

హిందూపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ఆదివారం హిందూపురానికి వస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘ నాయకులు మధుసూదన రెడ్డి, రంగారెడ్డి, ఈశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాలలో సమావేశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను చెప్పుకోవచ్చన్నారు.